క్లుప్తంగా

పేరంటాలమ్మ హుండీ ఆదాయం రూ. 13.13 లక్షలు



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని హుండీలను 73 రోజులకు గానూ లెక్కించగా రూ. 13,13,870 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. భక్తులు అమ్మవార్లకు కానుకల రూపంలో హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని దేవదాయ శాఖాధికారి జీవీ కృష్ణా రావు పర్యవేక్షణలో మంగళవారం లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ధర్మకర్తలు, గ్రామ పెద్దలు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా కాలువ పూడికతీత పనులు



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు పోరంకి రోడ్డులో ప్రధాన డ్రెయిన్‌ను మంగళవారం జేసీబీతో పూడికతీత పనులు నిర్వహించారు. ఈ పనులను పరిశీలించిన సర్పంచ్ శీలం రంగారావు మాట్లాడుతూ పోరంకి రోడ్డులో 90 ఫ్లాట్స్ నుంచి పోరంకి బోర్డర్ వరకు పంచాయతీ నిధులతో ఈ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని మురుగంతా ఈ ప్రధాన డ్రెయిన్‌లో కలుస్తుందని చెప్పారు. పార్టీ నాయకుడు బొగ్గవరపు రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ల ఏర్పాటు



రామవరప్పాడు: వైఎస్సార్ సీపీ గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ అందజేసిన వాటర్ కూలర్లను నిడమానూరు సీడబ్ల్యూసీ గోడౌన్ సెంటర్‌లో మంగళవారం సర్పంచ్ శీలం రంగారావు, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ వేసవి కాలం దృష్టిలో పెట్టుకుని వంశీమోహన్ ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి ఈ కూలర్లు అందజేశారని తెలిపారు. ఈ కూలర్ల ఏర్పాటుతో గోడౌన్‌లోని కార్మికులతో పాటు, ప్రయాణికులకు చల్లటి తాగునీరు అందుతుందన్నారు. అనంతరం సర్పంచ్ రంగారావు ఆధ్వర్యంలో గోడౌన్‌లో పని చేసే కార్మికులందరికీ టవల్స్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ ఎలక్షన్స్ ఇన్‌చార్జి ఆర్.వెంకటేశ్వరరావు, పరిమి విష్ణు, బొగ్గవరపు రాజేంద్రప్రసాద్, మండల సోషల్ మీడియా కన్వీనర్ పెనుమాక రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ సరఫరా లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం సాయంత్రం 3.30 నుంచి ఆరు గంటల వరకు గన్నవరం సెక్షన్‌లోని పామర్తినగర్, రైస్‌మిల్ బజార్, రాజీవ్‌కాలనీ, ఎస్టీబీఎల్ కాలనీ, మల్లికార్జున స్కూల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

కోడి పందేలు ఆడుతున్న వక్తులు అరెస్ట్

ఉంగుటూరు: పెద్ద అవుటపల్లిలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆత్కూరు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద అవుటపల్లి జెండా చెట్టు సెంటర్‌లో కొందరు వ్యక్తులు కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ పైడిబాబు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రెండు కత్తులు, రూ. 3,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

జగనన్న పాలనలోనే పేదలకు న్యాయం

మంత్రి జోగి రమేష్



యనమలకుదురులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలోనే పేద ప్రజలకు పూర్తిగా న్యాయం జరిగిందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. యనమలకుదురు ఇందిరానగర్-2లో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి జోగి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలతో జగనన్న పేదలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని పేర్కొన్నారు. రైతులు, విద్యార్థులు, మహిళలకు సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మాణం చేశారని వివరించారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని అన్నారు. నేడు పేదల సొంతింటి కల నెరవేరిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా జగనన్న పేదల పక్షాన ఉంటారని పేర్కొన్నారు.

కాలువ కట్ట వాసులకు భరోసా..

కాలువ కట్టలపై నివసిస్తున్న పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో భరోసా లభించిందని మంత్రి జోగి రమేష్ అన్నారు. చంద్రబాబు పాలనలో కాలువ కట్టలపై నివసించే పేదల ఇళ్లు తొలగించడానికి కుట్ర జరిగిందని ఆరోపించారు. చంద్రబాబుకు పేదలంటే గిట్టదని, ఆయన పెత్తందారులకు అండగా ఉంటాడని విమర్శించారు. జగనన్న పాలనలో కాలువ కట్టలపై నివాసితులు ధైర్యంగా ఉండవచ్చని అన్నారు. ఎన్నికల వేళ మూడు పార్టీల కూటమి నేతలు వచ్చి మాయమాటలు చెబుతారని, వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి, పెనమలూరు ఏఎంసీ చైర్‌పర్సన్ నినావత్ చిన్ని, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు పి.రాఘవరావు, ఈడే చాముండేశ్వరి, గుమ్మడి విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నేతలు మరీదు శ్రీనివాస రావు, కర్రా ఆదిశేషారావు, మున్నా, సలీమ్, లతీఫ్, వడుగు పరమేశ్వరరావు, ఈడే గోపాలకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన రిటర్నింగ్ అధికారి గీతాంజలీశర్మ

గన్నవరం: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలీశర్మ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం ఎన్నికల ప్రవర్తన నియమావళిపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించాలని చెప్పారు. ప్రైవేట్ స్థలాల్లో ఏర్పాటు చేసే బ్యానర్లు, ఫ్లెక్సీలకు కూడా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తెలిపారు. వీటితో పాటు సమావేశాలు, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాలు, మైక్ ప్రచార అనుమతుల కోసం ఎన్నికల కమిషన్‌కు చెందిన వివిధ యాప్‌ల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిర్ణీత ప్రొఫార్మాలో దరఖాస్తులు అందజేస్తే త్వరితగతిన సింగిల్ విండోలో అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ప్రస్తుతం 2,76,985 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. వీరిలో విజయవాడ రూరల్ మండలంలో 88,111, గన్నవరం మండలంలో 73,853, బాపులపాడు మండలంలో 71,481, ఉంగుటూరు మండలంలో 43,540 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. సమావేశంలో సహాయక రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్ పవన్‌కుమార్, వైఎస్సార్ సీపీ, టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సాగుతున్న 'పది' పరీక్షలు

ఉంగుటూరు: మండల వ్యాప్తంగా పది పరీక్షలు పకడ్బందీగా సాగుతున్నాయి. మంగళవారం 631 మంది విద్యార్థులకు గానూ 606 మంది పరీక్షలకు హాజరయ్యారని ఎంఈఓ-2 సాంబశివరావు తెలిపారు. 25 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

కంకిపాడు: మండలంలోని తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో మంగళవారం హిందీ పరీక్ష నిర్వహించారు. రెగ్యులర్ విద్యార్థులు 1347 మందికి గానూ 1346 మంది హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 34 మందికి గానూ నలుగురు మాత్రమే పరీక్షకు హాజరుకాగా 30 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ ప్రసాద్ తెలిపారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంగవారం జరిగిన హిందీ పరీక్షకు బాపులపాడు మండలంలో 46 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ శ్రీరామ్ బాలాసింగ్ తెలిపారు. బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లోని బీ-సెంటర్‌లో అత్యధికంగా 28 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు వివరించారు.

గ్రామాల్లో పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు



అంబాపురంలో పోస్టర్లను తొలగిస్తున్న అధికారులు

పెనమలూరు: మండల పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేస్తున్నారు. గ్రామాల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, జెండాలు, స్టిక్కర్లు తొలగించారు. గ్రామాల్లో ఉన్న పలు రాజకీయ నాయకుల విగ్రహాలు కనిపించకుండా ముసుగు కప్పారు. అలాగే ప్రభుత్వ వాహనాలపై ఉన్న స్టిక్కర్లు సైతం తీసివేశారు. ఈ సందర్భంగా కోడ్ అమలు చేస్తున్న ఎంపీడీఓ కుమార్‌బాబు వివరాలు తెలుపుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ అన్ని ప్రాంతాల్లో అమలు చేస్తున్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని మెలగాలన్నారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విజయవాడరూరల్: మండలంలోని గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మోడల్ ఆఫ్ కోడ్ కాండక్ట్ కమిటీ సభ్యులు, ఈఓఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు, అంబాపురం, జక్కంపూడి కార్యదర్శి డి.శ్రీనివాసరావుల పర్యవేక్షణలో పలు రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను మంగళవారం తొలగించారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల లోపు దూరంలో ఉన్న రాజకీయపార్టీ కార్యాలయాలను తొలగించాలని ఆయా పార్టీల ప్రతినిధులకు సూచించారు.

డాక్టర్ వెంకటేష్‌కు జీడీఏ ఏపీ సంఘం అభినందనలు



డాక్టర్ వెంకటేష్‌ను అభినందిస్తున్న జీడీఏ ఏపీ సంఘ సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల వైద్య విద్య అదనపు సంచాలకులు(అడిషనల్ డీఎంఈ)గా పదోన్నతి పొందిన ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్‌కు మంగళవారం గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్(జీడీఏ ఏపీ) సిద్ధార్థ వైద్య కళాశాల శాఖ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జనరల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఇంజేటి బాబ్జి శ్యామ్‌కుమార్, డాక్టర్ సంపత్‌లు మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన సేవలు అందించేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసేలా కృషి చేస్తున్న డాక్టర్ వెంకటేష్‌కు పదోన్నతి రావడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం వైద్య విద్య అదనపు సంచాలకులుగా పదోన్నతి పొందడంతో పాటు, ఆయనకు ఉన్న అనుభవంతో రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అందుకోసం తమ సంఘ సభ్యులు సైతం రోగులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ దుర్గారాణి, కోశాధికారి డాక్టర్ రత్నబాబు, డాక్టర్ నూరుల్లా, డాక్టర్ అంకిత తదితరులు పాల్గొన్నారు.

రేపు సిద్ధార్థలో ఇన్‌కెండో-2కె24

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కామర్స్ చదివే విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ నెల 21వ తేదీ గురువారం సిద్ధార్థ ఆడిటోరియంలో తమ కళాశాల కామర్స్ విద్యార్థుల విభాగం ఆధ్వర్యంలో ఇన్‌కెండో-2కె24 పేరుతో పోటీలను నిర్వహిస్తున్నట్లు పీబీ సిద్ధార్థ కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల తెలిపారు. కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో ఇన్‌కెండో-2కె24 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రాజేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కామర్స్ విభాగాధిపతి నారాయణరావుతో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు కలిసి మంగళవారం ఆవిష్కరించారు. రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులకు క్విజ్, ఫ్లోర్ క్రాసింగ్, దలాల్ స్ట్రీట్, యాడ్-మాడ్, ఫైనాన్షియల్ అనలిస్ట్, డ్యాన్స్ టూ ట్రిబ్యూట్, మైండ్ ఇట్, ఐపీఎల్, మిస్టర్ అండ్ మిస్ ఇన్‌కెండో-2024 పేరుతో ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నామని తెలిపారు. కామర్స్ విభాగాధిపతి కోనా నారాయణరావు మాట్లాడుతూ.. గురువారం ఉదయం 9 గంటల నుంచి సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమానికి అతిథిగా ఆదాయపు పన్ను శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ టి.సతీష్ వర్మ పాల్గొంటారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలల్లో కామర్స్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపుతారన్నారు. పోటీల్లో విజేతలకు గురువారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు.

పౌష్టికాహారంతో పాటు వ్యాయామం అవసరం



వ్యాయామం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు

కంకిపాడు: పౌష్టికాహారంతో పాటు శరీరానికి వ్యాయామం కూడా అవసరమేనని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నామణి సూచించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని కంకిపాడు పట్టణంలోని ఏడో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. పౌష్టికాహార ప్రాధాన్యత, వ్యాయామం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి నిత్యం యోగా, వ్యాయామం చేయడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండటమే కాకుండా ఎదుగుదల బాగుంటుందని అన్నామణి పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలు నళినీకుమారి, లక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తాడిగడపలో శానిటేషన్ డ్రైవ్



తాడిగడపలో డ్రైనేజీ పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: తాడిగడపలో మంగళవారం శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ జరిగింది. సచివాలయం-1 పరిధిలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు విస్తృతంగా పర్యటించారు. డ్రైనేజీల్లో క్రమం తప్పకుండా పూడిక తీయాలని కమిషనర్ ఆదేశించారు. చెత్త కుండీలు కూడా ప్రతీ రోజు చెత్త తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాడిగడపలో శానిటేషన్ పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్ 1కు చెందిన మహిళకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె కుటుంబ అవసరాల కోసం రూ. 30 వేలకు బంగారు నగలు తాకట్టుపెట్టింది. ఈ విషయం ఇంటి ఎదురుగా ఉండే నాగరాజుకు చెప్పింది. దీంతో నాగరాజు సొమ్ము చెల్లించి బంగారం విడిపించి తన వద్ద ఉంచుకున్నాడు. మహిళ తన వద్ద డబ్బు ఉన్నప్పుడు బంగారు తీసుకుంటానని నాగరాజుకు చెప్పింది. అప్పటి నుంచి నాగరాజు ప్రవర్తనలో మార్పు వచ్చింది. ఫోన్ చేసి మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించసాగాడు. నాగరాజు ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేయడంతో ఇంటికి వచ్చి బెదిరించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. పోలీసులు నాగరాజుపై కేసు నమోదు చేశారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

పెనమలూరు: తాడిగడప ఎస్‌టీబీఎల్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప ఎస్‌టీబీఎల్ కాలనీ ఎస్ఎల్వీ గార్డెన్స్‌కు అసోసియేషన్ అధ్యక్షుడిగా కోవెలమూడి వెంకట శివనాగ మల్లేశ్వరరావు గత నాలుగు సంవత్సరాల నుంచి ఉన్నారు. ఈ నెల 17వ తేదీన అసోసియేషన్ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో సభ్యులు మాట్లాడుతున్న సమయంలో అదే కాలనీకి చెందిన చింతమనేని రాకేష్ కల్పించుకుని అసోసియేషన్ సభ్యులను దుర్భాషలాడటంతో వెంకటశివనాగ మల్లేశ్వరరావు వారించాడు. దీంతో రాకేష్ కర్రతో వెంకటశివనాగ మల్లేశ్వరరావుపై దాడి చేసి గాయపరిచాడు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అందరి అంతుచూస్తానని రాకేష్ బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

స్థల యజమానురాలిని బెదిరించిన ఘటనపై కేసు

పెనమలూరు: స్థల యజమానురాలిని బెదిరించిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి బ్రహ్మంగారి గుడి వద్ద నివాసం ఉంటున్న పి.శేషమణికి కొంత స్థలం ఉంది. తిరువూరు ప్రభుత్వ కాలేజీ అధ్యాపకుడిగా పని చేస్తున్న కె.మాధవరావు స్థలం తీసుకుని గ్రూప్‌హౌస్ నిర్మాణం చేపట్టాడు. ఆ స్థలానికి పక్కనే శేషమణి స్థలం కూడా ఉండటంతో దారి కోసం తీసుకున్నాడు. దీనికి గాను గ్రూప్‌హౌస్‌లో ఒక ప్లాటు, రూ. 18 లక్షలు ఇచ్చే విధంగా హామీ పత్రం రాసి రూ. 6 లక్షలు చెల్లించాడు. ఆ తర్వాత గ్రూప్‌హౌస్ నిర్మాణం పూర్తి చేయలేదు. ఇంకా ఇవ్వాల్సిన సొమ్ము చెల్లించలేదు. దీంతో బిల్డర్ మాధవరావును అడుగగా అతను, అతని సోదరుడు వాసుదేవరావు కలిసి అసభ్యంగా మాట్లాడి దౌర్జన్యం చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం డీఆర్ఎం కార్యాలయం మీదుగా రైల్వే స్టేషన్ వరకు నిరసన ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘ్ ఏజీఎస్ ఎడ్ల నాగేంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరితో కార్మిక చట్టాలను అణచివేస్తుందని విమర్శించారు. నూతన పెన్షన్ విధానంతో రైల్వే కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. ఈ నూతన విధానంతో పదవీ విరమణ చేసిన వారికి పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలు మాత్రమే వస్తుందన్నారు. దీంతో వారి కుటుంబం ఎలా మనుగడ సాగిస్తాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా రైల్వే కార్మికుల న్యాయమైన డిమాండ్ పాత పెన్షన్‌ను కేంద్రం వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ సంఘ్ డివిజన్ అధ్యక్షుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, కొత్తగా ప్రవేశపెడుతున్న రైళ్ల కనుగుణంగా ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ్ డెప్యూటీ సెక్రటరీ రాజబాబు, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు అల్లం రమేష్, శ్రీను, సీఅండ్‌డబ్ల్యూ బ్రాంచ్ సెక్రటరీ కర్పూలు సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు



రామవరప్పాడులో ఇంటింటికీ పర్యటిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రామవరప్పాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని గన్నవరం నియోజకవర్గ ఎలక్షన్ ఇన్‌చార్జి రామిశెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు బూత్ నెంబరు 35లో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు గడప గడపకు పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ సిద్ధాంతాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 99 శాతం హామీలను సీఎం జగన్ అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగలన్నా, అర్హులైన ప్రతీ ఒక్కరికి లబ్ధి చేకూరాలన్నా మనందరం కలిసి జగన్‌ను మరల ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పేర్కొన్నారు. త్వరలో సీఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీ, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెగదు.. ముడిపడదు..

- తేలని పెనమలూరు సీటు పంచాయితీ
- కొత్తగా ఆలపాటి రాజా పేరుతో సర్వే
- క్లారిటీ ఇవ్వని అధిష్టానం
- సర్వే తీరుతో మండిపడుతున్న శ్రేణులు

కంకిపాడు: పెనమలూరు సీటు పంచాయితీ తెగడం లేదు.. ముడిపడటం లేదు. సీటు ఎవరికి ఇచ్చేది టీడీపీ అధిష్టానం తేల్చడం లేదు. రోజుకో కొత్త పేరును తెరపైకి తెస్తోంది. అధిష్టానం ఏ సంగతీ తేల్చకపోవడం, సర్వేల పేరుతో విసిగించడంతో అధిష్టానం తీరుపై పార్టీ శ్రేణులు ఓ వైపు గందరగోళానికి గురవుతూ మరో వైపు మండిపడుతున్నారు. ఇప్పటికే అధిష్టానం సీటు ఇచ్చేది లేదని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ ఇన్‌చార్జి బోడె ప్రసాద్‌కు స్పష్టమైన సంకేతం ఇచ్చింది. అధికారంలో లేకపోయినా పార్టీ కోసం కోట్లు ఖర్చయ్యిందని, జిల్లాలో ఏ కార్యక్రమం పెట్టినా తన వంతు వెచ్చించానని పలు మార్లు వ్యాఖ్యలు చేశారు. ఎంతో ఖర్చుపెట్టి చిన్నబాబు యువగళం విజయవంతం చేశానని, అయినా అధిష్టానం అన్యాయం చేసిందంటూ అధిష్టానం తీరును ఎండగడుతున్నారు. తనకు న్యాయం చేయాలని ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు బోడె. అయితే అక్రమ ఇసుక తవ్వకాలు, మట్టి దోపిడీ, కాల్ మనీ, సెక్స్ రాకెట్, దొంగ పరీక్షల ఆరోపణలు, వర్గ వైషమ్యాల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు సీటు దక్కలేదన్నది ఆయన వ్యతిరేక వర్గం అంటున్న మాట. ఆయన వర్గం మాత్రం సీటు ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్న పరిస్థితి. మరో వైపు సీటు తనకిస్తే పెనమలూరు సీటు గెలిచి కానుకగా ఇస్తానంటూ చలసాని పండు కుమార్తె దేవినేని స్మిత బాహాటంగా చెబుతూ వర్గ సమీకరణను వేగం చేశారు.

తెరపైకి కొత్తమొహం..

టీడీపీ అధిష్టానం పెనమలూరు సీటును ఎటూ తేల్చకుండా నాన్చుతోంది. ఇప్పటికే పార్థసారథి, వసంత కృష్ణప్రసాద్, దేవినేని ఉమా, ఎంఎస్ బేగ్ పేరుతో ఐవీఆర్ఎస్ సర్వే చేయించింది. తాజాగా తెరపైకి కొత్తమొహం వచ్చింది. గుంటూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఆలపాటి రాజాను అధిష్టానం పరిశీలిస్తోంది. ఆలపాటి రాజా పేరుతో ఐవీఆర్ఎస్ సర్వే కూడా చేయించింది. స్థానికులు, జిల్లా వాళ్లు కాదని పక్క జిల్లాలకు కూడా పోయే గతి పట్టిందంటూ కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. వర్గాలను చక్కదిద్దడంలో అధిష్టాన వైఫల్యం ఉందని వాపోతున్నారు. ఎవరెవరి పేరుతోనో సర్వేలు జరుగుతున్నాయని, ఎవరిని తెచ్చి సీటు ఇస్తారో అర్థం కావడం లేదని ఆ పార్టీ వర్గాలు అధిష్టానంపై గుర్రుగా ఉన్నాయి.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు రేమల్లేకు చెందిన మూల్పూరు రాజేంద్రప్రసాద్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.